వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26 : దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీ పర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, బెడ్‌సైడ్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 830903 7134, 630589 5867 సంప్రదించాలని సూచించారు.

దూరవిద్య పరీక్షా ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంసీఏ మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు.

ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 1వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి, వచ్చే నెల 5వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 7వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫుడ్ సేఫ్టీ.. సున్నా

ఆహార కల్తీ.. రోగాలతో కుస్తీ

- దేశంలోనే మొదటి స్థానంలో హైదరాబాద్
- పెరుగుతున్న జీర్ణ వ్యవస్థ, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కేసులు
- స్లో పాయిజన్‌లా మారిన కల్తీఫుడ్
- 30మంది ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నా.. కట్టడి శూన్యం
- భయంకరమైన వ్యాధులతో పోరాటం చేస్తున్న పదేండ్లు నిండని చిన్నారులు
- కల్తీకి పాల్పడి పట్టుబడితే జీవిత ఖైదు.. ఎక్కడ అమలు.?
- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ) : కల్తీకి కాదేది అనర్హం అన్నట్లుగా.. చిన్న పిల్లలు వాడే సబ్బుల నుంచి మొదలుకొని తాగే పాల వరకు కలుషితం చేసి కాలకూట విషంగా మారుస్తున్నారు. ఆహార కల్తీ నియంత్రణకు కఠినమైన చట్టాలే ఉన్నప్పటికీ.. వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యం కారణంగా జనాల చెంతకు కల్తీ పదార్థాలు చేరుతున్నాయి. అదేవిధంగా కల్తీ వస్తువులు, పదార్థాల తయారీలో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉన్నదని నేషనల్ క్రైం రికార్డు బ్యూరో నివేదిక చెబుతుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కేసులు పెరుగుతున్నాయి. అయితే విస్తృతమైన అవగాహన కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆహార నిపుణులు, వైద్యులు, న్యాయవాదులతోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ సమావేశంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రెసిడెంట్ ఎం.పద్మనాభ రెడ్డితోపాటు పలువురు నిపుణులు హాజరయ్యారు.

స్లో పాయిజన్‌లా కల్తీ

రాష్ట్రంలో ఆహార కల్తీ పెద్ద ఎత్తున జరుగుతున్నది. అత్యాశతో వ్యాపారం చేస్తూ ఆహార పదార్థాలను కలుషితం చేసి జనాలకు స్లో పాయిజన్‌లా ఎక్కిస్తున్నారు. రసాయనాలు పంటలను కూడా పాడుచేస్తున్నారు. ప్యాకింగ్ మెటీరియల్‌తోనూ కల్తీ జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. జీర్ణకోశం పాడైపోవడం, చూపు మందగించడం, కీళ్ల నొప్పులు, క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతం వంటి రోగాలతో మృతిచెందుతున్నారు. అయినా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపార నిర్వహకులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయని నిపుణులు ప్రశ్నించారు.

పలు విధాలుగా కల్తీ...

ఆహార పంటల ఉత్పత్తి, ప్యాకింగ్ మెటీరియల్, ఇథసాన్, ఇథరల్, కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలను పండ్లు, కూరగాయాల్లో వినియోగించి వ్యాపారాలు చేస్తున్నారు. 2006లో ఫుడ్ సేఫ్టీ, స్టాండర్ చట్టం అమలులోకి వచ్చినప్పటికీ.. శిక్షలు కఠినంగా లేకపోవడంతో నిర్విరామంగా కల్తీ వ్యవహారాలు సాగుతూనే ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా మిస్ బ్రాండెడ్, సబ్ స్టాండర్డ్ వస్తువుల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటితో తీవ్రమైన అనారోగ్య సమస్యల బారినపడుతున్నారు.

కల్తీకి పాల్పడి పట్టుబడితే జీవిత ఖైదు

హైదరాబాద్ కేంద్రంగా రోడ్డు పక్కన నడిపించే ఫుడ్ కోర్టు నుంచి మొదలుపెట్టి స్టార్ హోటళ్ల వరకు నాసిరకం పదార్థాలను వినియోగిస్తున్నట్లుగా పలు తనిఖీల్లో వెల్లడైంది. అయినా ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఆహార పదార్థాల కల్తీకి పాల్పడి పట్టుబడితే జీవిత ఖైదు విధించాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. బడా రెస్టారెంట్లు, హోటళ్లు కూడా కల్తీ పదార్థాలతో ఆహారాన్ని జనాలకు వడ్డిస్తున్నాయి.

– పద్మనాభ రెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, అధ్యక్షుడు

దేశంలోనే హైదరాబాద్ నంబర్ వన్

బిర్యానీ సిటీగా పేరుగాంచిన హైదరాబాద్ కేంద్రంగా కల్తీ ఆహార ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయి. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం హైదరాబాద్‌లోనే అత్యధిక కేసులు నమోదవుతున్నాయని నిపుణులు పేర్కొన్నారు. గ్రేటర్‌లో కల్తీని నియంత్రించేలా 30మంది ఫుడ్ సేఫ్టీ అధికారులు పనిచేస్తున్నప్పటికీ కేసులు మాత్రం గణనీయంగా పెరుగుతూనే ఉన్నాయి.

ప్రాణాలు పోతున్నాయి

ఆహార పదార్థాలను కల్తీ చేయడం వలన ప్రాణాలు పోతున్నాయి. నిజానికి వ్యాపారులు చేసే అక్రమాలపై అవగాహన లేకపోవడంతోనే కొనుగోలుదారులు నష్టపోతున్నారు. దీర్ఘకాలం పాటు కల్తీ పదార్థాలతో చేసిన ఆహారాన్ని తీసుకోవడంతో ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. పదేళ్లు నిండని చిన్నారులు భయంకరమైన వ్యాధులతో పోరాటం చేస్తున్నారు. ఇదంతా ఆహార పదార్థాల కల్తీపై అవగాహన లేకపోవడంతోనే జరుగుతుంది.

– డా. కిషన్, గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు

నమస్తే ఫొటోగ్రాఫర్ కుటుంబానికి చేయూత



రాజేశ్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మజీదుల్లాహ్ హుస్సేన్, తదితరులు

సైదాబాద్, ఫిబ్రవరి 26 : ఇటీవల అకాల మరణం పొందిన 'నమస్తే తెలంగాణ' దిన పత్రిక ఫొటో గ్రాఫర్ నర్నె రాజేశ్ కుటంబ సభ్యులకు సోమవారం టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ మజీదుల్లాహ్ హుస్సేన్ (ముజీబ్) రూ.21వేల చెక్కును రాజేశ్ సతీమణి నర్నె లావణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ రాజేశ్ కుమార్తె, కుమారుడి చదువులకు సంబంధించిన బాధ్యతలను తాను స్వీకరిస్తున్నానని, వారి చదువుల నిమిత్తం అయ్యే ఖర్చులను భరిస్తానని తెలిపారు. అదేవిధంగా కుటుంబ పోషణ నిమిత్తం నర్రె లావణ్యకు ఉద్యోగం కల్పించేందుకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర నాయకులు పర్వతాలు, జిల్లా సభ్యులు కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, బొలిగిద్ద శంకర్, ముస్తఫా షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

హర్షం వ్యక్తం చేసిన బ్రాహ్మణ సంఘాలు

ఎల్బీనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 26 : మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ బ్రాహ్మణ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యదర్శి తులసీ శ్రీనివాస్, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ, భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ ప్రధాన కార్యదర్శి దుడ్డు సుబ్రహ్మణ్యం, తెలంగాణ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య రీజనల్ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వారణాసి వంశీ తదితరులు మాట్లాడుతూ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వాహించాలని నిర్ణయించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి వారు ధన్యవాదములు తెలిపారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో డీఎస్సీ ఎదుట ధర్నా

నినాదాలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేశ్ తదితరులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26 : మెగా డీఎస్సీని తక్షణమే ప్రకటించి 25వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ఖైరతాబాద్‌లోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరుద్యోగుల ఆందోళనకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీలో 11వేల పోస్టులు మాత్రమే ప్రకటించే అవకాశం ఉన్నదని, అయితే 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పీఆర్‌సీ కమిటీ పేర్కొందని, ఈ నేపథ్యంలో అన్ని పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ పోస్టుల భర్తీ విషయంలో అధికారులపై ఆధారపడకుండా నిరుద్యోగుల సంఘాలు, ఉద్యోగ సంఘాలతో చర్చించాలన్నారు. అలాగే పది వేల మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. తద్వారా మరో పది వేల పోస్టులు అందుబాటులో ఉంటాయన్నారు. 16వేల విద్యావలంటీర్లను రెండు సంవత్సరాల క్రితం నియమించారని, తాజాగా 22వేల స్పెషల్ టీచర్ పోస్టుల భర్తీకి కూడా ఆర్థిక శాఖ ఆమోదించిందని, టీచర్ పోస్టులు ఖాళీగా లేకపోతే ఈ స్పెషల్ టీచర్లు ఎందుకు భర్తీ చేస్తున్నారని ప్రశ్నించారు. గడిచిన పది సంవత్సరాలలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఎంతమంది విరమణ పొందారు, పదోన్నతులు లభించిన వారి లెక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు నీల వెంకటేశ్, అనంతయ్య, సుధాకర్, రాజేందర్, ప్రీతం కుమార్, పృథ్వి గౌడ్, మధు పాల్గొన్నారు.

కొలకలూరి సేవలు ఎనలేనివి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ● తెలుగు వర్సిటీలో కొలకలూరి పురస్కారాలు ప్రదానం

శ్రీనివాసరావు రచించిన మాదిగల ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి, ఆచార్య కొలకలూరి సాహిత్య పురస్కారాలు ప్రదానం చేసిన వక్తలు

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 26 : సమాజంలోని రుగ్మతలను రూపుమాపే రచనలు సాగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలుగు భాషా సాహిత్యాలకు దశాబ్దాలుగా కొలకలూరి కుటుంబం ఎనలేని సేవలందిస్తున్నదని వక్తలు ప్రశంసించారు. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కొలకలూరి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వీసీ, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ కుటుంబ సభ్యులు గత 17సంవత్సరాలుగా సాహితీశ్రేష్ఠులకు ప్రదానం చేస్తున్న కొలకలూరి పురస్కారాలను 2024సంవత్సరానికి గాను పలువురికి ప్రదానం చేసి సత్కరించారు. ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రచనలతో సమాజాన్ని ప్రభావితం చేసిన వారిని సత్కరించుకోవడం సంప్రదాయం అన్నారు. తెలుగువర్సిటీ వీసీ ఆచార్య టి.కిషన్‌రావు, ఆచార్య సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని ఆచార్య కొలకలూరి ఇనాక్ జీవితం, సాహిత్యంపై ప్రసంగించి ప్రశంసించారు. కొలకలూరి భాగీరథీ కథానిక పురస్కారానికి గాను హుమయూన్ సంఫీర్ రచించిన కామునికంత, కేవీ మేఘనాథరెడ్డి రచించిన కలుంకూరి గుట్ట, కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారానికి డాక్టర్ దిలావర్ రచించిన అడవి బతుకులు, సింహప్రసాద్ రచించిన నిర్మాల్యం, కొలకలూరి రామయ్య విమర్శన పురస్కారానికి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి రచించిన తాత్త్విక నేపథ్యంలో తెలుగు కవిత్వ పరిణామమం, వి.రాజా రామ్మోహనరావు రచించిన నవలా హృదయంకు పురస్కారాలను అందజేశారు. ప్రతీ విభాగంలోనూ ప్రథమ పురస్కార గ్రహీతకు 15వేల నగదు, ద్వితీయ పురస్కార గ్రహీతకు 5వేల నగదును బహూకరించారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం–సామాజిక విశ్లేషణపై పరిశోధనలు చేసిన డాక్టర్ గడ్డం తిరుపతమ్మ, ఆచార్య కొలకలూరి నవలా సాహిత్యం–మానవతా ధృక్పథం అనే అంశంపై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ దుగులూరి సురేఖను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు కె.ఆశాజ్యోతి, జనార్దనం, కె.అనిత, శ్రీధర్, పాల్గొన్నారు.

యూనివర్సిటీల అభివృద్ధికి కృషి : మంత్రి పొంగులేటి

సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26 : రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధికి త్వరలోనే వైస్ చాన్సలర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార ప్రసారాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ధరణిపై త్వరలోనే శ్వేత పత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ తెలంగాణ స్టేట్ : ఎమర్జింగ్ ఇష్యూస్, పాలసీ ఇంటర్వెన్షన్స్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్ట్స్'అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి హాజరై ప్రసంగించారు. కీలక ఉపన్యాసకులుగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలు, సామాజిక మార్పు, ప్రజాస్వామిక ప్రక్రియతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, సదస్సు డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చింత గణేశ్, ఓయూ సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.అర్జున్‌రావు, సోషియాలజీ విభాగం బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ విష్ణుదేవ్, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ రామ్ బీనవేణి షెఫర్డ్, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నాగయ్య, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ, ప్రొఫెసర్ చెన్న బసవయ్య, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 26 : ఎస్సీ, ఎస్టీల కోసం కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనులకు పట్టించుకోకుంటే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ వాగ్మరే, ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు జగదీశ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాను, తలారీ గోపాల్, ఇందర్ కుమార్, బి.చంద్రశేఖర్, నారాయణ నాయక్, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ పదోన్నతి పొందిన ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్టీపీలను ట్రయల్ రన్‌కు సిద్ధం చేయండి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ఫతేనగర్, ఖాజాకుంట, మియాపూర్ పటేల్ చెరువు దగ్గర నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఎండీ సుదర్శన్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. ఎస్టీపీల నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ట్రయల్ రన్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. మిగతా ప్రాంతాల్లో నిర్మాణంలో తుది దశలో ఉన్న ఎస్టీపీలను సైతం త్వరగా పూర్తి చేయాలన్నారు. చిన్న, చిన్న సివిల్ వర్క్స్, గార్డెనింగ్, పెయింటింగ్ లాంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి వాటిని కూడా ట్రయల్ రన్‌కు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎం పద్మజ, ఇతర అధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలోమీటర్లు బారులు

ముంబై జాతీయ రహదారిపై ఎర్రగడ్డ నుంచి మూసాపేట వరకు సోమవారం మధ్యాహ్నం గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రైతు వ్యతిరేకి మోదీ ప్రభుత్వం

కవాడిగూడ, ఫిబ్రవరి 26 : తమ పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీ సరిహద్దులో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల బాధలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రైతుల నిరసనకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వ భారీ పోలీసు–సైనిక అణిచివేతను నిరసిస్తూ హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ నాయకులు ఎర్ర జెండాలు, ప్ల–కార్డులు చేతబూని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనలు చేస్తున్న రైతు సమాజానికి సంఘీభావం తెలిపారు. ఈ ప్రదర్శనలో డాక్టర్ కె.నారాయణతో పాటు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేణి శంకర్, ఎస్.బాలమల్లేశ్, ఈటీ నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధరపై కేంద్రం చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా నేతలు జే.లక్ష్మి, ఉమామహేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.